క్లుప్తంగా

మొక్కలు నాటిన టోల్ సిబ్బంది



మొక్కలు నాటుతున్న టోల్ సిబ్బంది

ఉంగుటూరు: టోల్ ప్లాజా ఆధ్వర్యంలో సిబ్బంది స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం టోల్ ప్లాజా వద్ద ప్రాజెక్టు మేనేజర్ కె.బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో టోల్ మేనేజర్ ఎస్‌కే ఇంతియాజ్, సిబ్బంది సుమారు 50 మొక్కలు నాటారు. కార్యక్రమంలో టోల్ సిబ్బంది, రూట్ మేనేజర్ గంట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో అన్నసమారాధన నిర్వహించారు. మంగళవారం పురస్కరించుకుని 300 మందికి నిర్వహించిన ఈ కార్యక్రమంలో హనుమాన్ జంక్షన్‌కు చెందిన నల్లబోయిన నాగరాజు, రజని దంపతులు ఆర్థిక సాయం అందించారు. ఆలయ ఈఓ తారకేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

డ్రెయిన్ పనుల పరిశీలన



డ్రెయిన్ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఉంగుటూరు: కంసాలిగుంటలో మ్యాజిక్ డ్రెయిన్ పనులను ఎంపీడీవో రాజీమనోజు పరిశీలించారు. ఉపాధి హామీ పథకంలో పైలట్ ప్రాజెక్టుగా మంజూరైన మ్యాజిక్ డ్రెయిన్ పనులను ఆయన పరిశీలించారు. మనోజు మాట్లాడుతూ పైలట్ ప్రాజెక్టుగా కంసాలిగుంట గ్రామానికి మంజూరైన రూ.20 లక్షలతో డ్రెయిన్ పనులను చేస్తున్నారన్నారు.

డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతతో అభివృద్ధి

దెందులూరు: డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతోనే అభివృద్ధి, సంక్షేమం ముడిపడి ఉందని డీబీఆర్‌సీ కో–ఆర్డినేటర్ బలే సురేష్ అన్నారు. మంగళవారం కొమిరేపల్లి సచివాలయంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తులు తమ ఆర్థిక నిర్ణయాలు సమర్థవంతంగా ఆర్థిక సంక్షేమాన్ని సాధించేందుకు నైపుణ్యాలను ప్రవర్తన వైఖరి పొందడమే ఆర్థిక అక్షరాస్యత అన్నారు.

దీక్ష చేస్తున్న రాంబాబుకు పరామర్శ



రాంబాబును పరామర్శిస్తున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: గోపన్నపాలెంలో గ్రంథాలయం కోసం రెండు రోజులుగా దీక్షలు చేస్తున్న ఏనుగు రాంబాబును మంగళవారం తహసీల్దార్ బి.సుమతి పరామర్శించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు రాంబాబుకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. దీక్షకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని రాంబాబుకు తహసీల్దార్ హామీ ఇచ్చారు.

25న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ఉంగుటూరు: ఈ నెల 25వ తేదీ (రేపు) నారాయణపురం సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ తెలిపారు. నిడమర్రు, ఉంగుటూరు మండలాల వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమానికి సాంకేతిక సభ్యులు ఎస్.రాజబాబు హాజరవుతారని చైర్మన్ ఒక ప్రకటనలో తెలిపారు.

పుల్లల లోడు ట్రక్ బోల్తా

జంగారెడ్డిగూడెం: మండలంలోని దేవులపల్లిలో పుల్లలలోడుతో వెళుతున్న ట్రాక్టర్ ట్రక్ తిరగబడింది. గ్రామ శివారులోని వల్లభ డైరీ వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. రోడ్డు గుంతల మయంగా, ఛిద్రంగా ఉండటం, వర్షాలకు గుంతల్లో నీరు నిలబడి పోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం జరిగిన ఈ ప్రమాదంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు.

కరుణించమ్మా.. కనకదుర్గమ్మ



దెందులూరు: గాయత్రీదేవిగా అమ్మవారు



నిడమర్రు: గాయత్రి అలంకరణలో అమ్మవారు



గణపవరం: ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు



నిడమర్రు: ధాన్యలక్ష్మిగా దుర్గాదేవి





భీమడోలు: బాలాత్రిపుర సుందరీదేవి అవతారంలో అమ్మవారు, భీమడోలు జంక్షన్‌లో భక్తుల పూజలందుకుంటున్న అమ్మవారు

ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు

భీమడోలు: మండల వ్యాప్తంగా దేవి నవరాత్రి ఉత్సవాలు రెండో రోజైన మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, సూరప్పగూడెం, ఎంఎంపురం, అంబర్‌పేట, కోడూరుపాడు, వడ్లపట్ల, కొల్లేరు గ్రామాల్లో తెల్లవారు జాము నుంచి భక్తులు అమ్మలగన్నమ్మ దుర్గమ్మను దర్శించుకున్నారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. భీమడోలు గ్రామంలోని రావిచెట్టు, పోస్టాఫీసు రోడ్డు, భీమడోలు జంక్షన్‌లో ఉత్సవ విగ్రహాల వద్ద భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి దర్శన చేసుకున్నారు. గుండుగొలనులో శ్రీభ్రమారాంబికా మల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారి లంకా శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పూళ్ల పంచాయతీ పరిధిలోని ఎంఎంపురం భవానమ్మ ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవి ఆలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

ధాన్యలక్ష్మిగా దర్శనం

నిడమర్రు: మండలంలో శరన్నవరాత్రి ఉత్సవాలు రెండో రోజు మంగళవారం వైభవంగా నిర్వహించారు. మందలపర్రు ఉమా నీలకంఠేశ్వర దేవాలయం, నిడమర్రు, బువ్వనపల్లి, పత్తేపురంలో అమ్మవార్లు గాయత్రీ అవతారంలోనూ, పెదనింద్రకొలను వెలంపేటలో ధాన్యలక్ష్మి అవతారంలోనూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు

గణపవరం: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేసి భక్తులు పూజలు నిర్వహించారు. గణపవరంలోని చినరామచంద్రపురం కనకదుర్గమ్మ గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బాలయ్య చెరువు వద్ద కంచికామాక్షి, కనకదుర్గమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. సరిపల్లెలోని కనకదుర్గమ్మను బంగారు, వెండి నగలతో ప్రత్యేకంగా అలంకరించారు. గణపవరం తోట, చినరామచంద్రపురం వైఎస్సార్ కాలనీ, పిప్పర, మొయ్యేరు, చిలకంపాడు, కేశవరం, కాశిపాడు, జల్లికాకినాడ, కొందేపాడు తదితర గ్రామాల్లో దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు.

గాయత్రీదేవిగా అమ్మవారు

దెందులూరు: దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గోపన్నపాలెం శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీగాయత్రీ దేవిగా కనకదుర్గమ్మ తల్లి భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ఆలయ ఆవరణలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఆలయ కమిటీ, మాజీ గ్రామ సర్పంచ్ కొండేటి హనుమంతు, తోట రామకృష్ణ, ఏనుగు అచ్చారావు, చొప్పవరపు జోగులు, తోట అచ్చారావు, ఏనుగు వెంకన్న, కుంకుళ్ల చందు, బి.చందు, వై.పండు, చంటి, బున్ని నాయుడు, వీరా మల్లేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

విచక్షణా రహితంగా మాను చెట్ల నరికివేత

ఉంగుటూరు: గొల్లగూడెం–రామచంద్రపురం గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రహదారిని ఆనుకుని ఉన్న మానుచెట్లు నరికి వేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా విచక్షణా రహితంగా నరికేశారు. అమ్మగా వచ్చిన డబ్బులు ప్రభుత్వ ఖాతాల్లో జమ చేశారా అంటే అదీ లేదు. ఆర్‌అండ్‌బీ అధికారులు పర్యవేక్షించాల్సి ఉంది. కాని ఆర్‌అండ్‌బీ అధికారులు అవేమి పట్టనట్లు పని చేస్తున్నారు. ఇదే పరిస్థితి మండలంలో చాలా రహదారుల వెంబడి మాను చెట్లు నరికేస్తున్నారు. ఓ వైపు విద్యుత్ శాఖ అధికారులు విచక్షణ రహితంగా చెట్లు నరికేస్తున్న విషయం తెల్సిందే. ఈ మధ్య కాలంలో నిడమర్రులో సబ్‌స్టేషన్ నిమిత్తం వైర్లు లాగే పనిలో గణపవరం ఆర్‌అండ్‌బీ రహదారి వెంబడి ఉన్న చెట్లు నరికేసిన విషయం తెల్సిందే. అలాగే కై కరం నుంచి రామన్నగూడెం లైన్ లాగడానికి కైకరంలో ఇలాంటి మానుచెట్లే నరికేసిన విషయం తెల్సిందే. ఓ వైపు పర్యావరణ సమతుల్యం లేక ఇబ్బందులు పడుతున్న విషయం తెల్సిందే. ఓ వైపు ప్రభుత్వం ప్రతి ఒక్కరూ చెట్లు పెంచాలని ప్రచారం చేస్తుంది. పెరిగి పెద్దయిన చెట్లు నరికేస్తే మాత్రం ప్రభుత్వం చర్యలు ప్రభుత్వం తీసుకున్న దాఖలాలు లేవు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నతానియేలు

దెందులూరు: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సత్ప్రవర్తన, క్రమశిక్షణతో జీవితాలను తీర్చిదిద్దుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నతానియేలు అన్నారు. మంగళవారం యాక్ట్–2017 టోల్‌ఫ్రీ నంబర్ 1097లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆదర్శ రూరల్ హెల్త్ అండ్ ఎకానమిక్ డెవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ శిరిష మాట్లాడుతూ హెచ్‌ఐవీ వ్యాధిపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పీడీ దిలీప్ కుమార్, రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు నూతన చట్టం తేవాలి

భీమడోలు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వలన వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందని, కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పూళ్లలోని కాలువ గట్టు సమీపంలోని శివాలయం వద్ద మంగళవారం రైతు సంఘం మండల మహాసభ సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. పలు తీర్మానాలను ఆమోదించారు. నూతనంగా కౌలు రైతుల చట్టం తేవాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సనపల వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శిగా గురజాల కృష్ణ బాలాజీ, ఉపాధ్యక్షుడిగా గొడవర్తి బాబూరావు, సహాయ కార్యదర్శిగా మండపాని సత్యనారాయణ, మరో ఏడుగురు సభ్యులను రైతులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కో–కన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, సీఐటీయూ మండల నాయకులు బెండు శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు, కౌలు రైతులు

యూరియా వాడకంతో రోగాలు అవాస్తవం

భీమడోలు: యూరియా వాడకంతో రోగాలు వస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేయడం తగదని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న యూరియా సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పూళ్లలో నిరసన వ్యక్తం చేశారు. రైతులకు పుష్కలంగా యూరియాను అందించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యూరియాపై నేరుగా రైతులకు సబ్సిడీ ఇస్తామని, యూరియాను వాడడం వల్లే రోగాలు వస్తున్నాయని ప్రచారం చేయడం రైతులను ఆందోళనకు గురి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

ఆక్వా చెరువుల ఆన్‌లైన్ పూర్తి చేయాలి

దెందులూరు: మండలంలోని ఆక్వా చెరువులను నిర్దేశించిన సమయంలోగా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. మంగళవారం ఏలూరు రూరల్ మండలం జాలిపూడి గ్రామంలో మత్స్యశాఖ అధికారులు, రైతులతో కలిసి ఆక్వా చెరువులను ఆమె పరిశీలించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఏపీ రాష్ట్ర ఆక్వా కల్చర్ అభివృద్ధి అథారిటీ యాక్ట్‌ను అనుసరించి జిల్లాలోని ఆక్వా చెరువుల వివరాలను నిర్దేశించిన సమయంలోగా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సచివాలయంలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 26582 ఆక్వా చెరువులున్నాయని, వాటి విస్తీర్ణం, యజమాని పేరు, ఆక్వా సాగు వినియోగిస్తున్న ఎరువులు ఆక్వా కల్చర్ యాప్‌లో ఇప్పటి వరకు 20,900 పూర్తయ్యాయన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ డీడీ వి.నరసయ్య, ఏలూరు రూరల్ తహసీల్దార్ జి.విజయకుమార్‌రాజు, మండల మత్స్యశాఖాధికారి ఉన్నారు.

జాలిపూడి యూపీ పాఠశాలలో..

స్వస్త్ నారీ, స్వశక్తి పరివార్ అభియాన్‌లో ఏర్పాటు చేసి వైద్యశిబిరాన్ని కలెక్టర్ వెట్రిసెల్వి ఆకస్మిక తనిఖీ చేశారు. ఎంత మందికి పరీక్షలు చేశారని అడగగా 70 మందికి వైద్య పరీక్షలు చేశామని చెప్పారు.

డ్రోన్లతో వ్యవసాయం లాభసాటి



డ్రోన్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో



పొలంలో దోమ ప్రభావాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు, రైతులు

నిడమర్రు: వరి సాగులో డ్రోన్ల వినియోగంతో రైతులకు సమయం, శ్రమ, ఖర్చు తగ్గి వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని మండల వ్యవసాయ అధికారి ఇంగర్ దైవ ఆశీర్వాదం అన్నారు. మంగళవారం ఎనికేపల్లి గ్రామంలో పొలం పిలుస్తోందిలో భాగంగా వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ డ్రోన్ల సాయంతో పంటల స్థితి, నీటి అవసరం, ఎరువుల లోపం, తెగుళ్ల దాడిని సులభంగా గుర్తించొచ్చన్నారు. ఆయకట్టు రైతులు ఏకకాలంలో ఎరువులు, పురుగుమందుల పిచికారీ, విత్తనాలు సమంగా చల్లడం వంటి ఉపయోగాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులు వాడాలి

పెదవేగి: సేంద్రియ ఎరువులు జీవ ఎరువులు ఉపయోగించడం ద్వారా మట్టి ఆరోగ్యం మెరుగై, దోమ ప్రభావం తగ్గుతుందని వ్యవసాయాధికారి సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం చక్రాయగూడెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతులు పంటలపై కీటకాలు వ్యాధులను గమనిస్తూ, సమయానికి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

26న కేవీఎస్ ప్రతిభా పురస్కార ప్రదానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన కూచిపూడి నృత్య గురువు, సినీ నృత్య దర్శకుడు కేవీ సత్యనారాయణ జన్మదినం సందర్భంగా కేవీఎస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా వివిధ రంగాల్లో విశేష కృషి చేస్తున్నావారికి ఇస్తున్న కేవీఎస్ ప్రతిభా పురస్కారం ఈ ఏడాది తమిళనాడుకు చెందిన మేలట్టూరు భాగవత కళాకారులు ఎస్ నాగరాజన్, ఎస్ అరవింద సుబ్రహ్మణ్యంలకు ప్రదానం చేయనున్నట్టు ట్రస్ట్ చైర్మన్ కేవీ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ పురస్కారాన్ని ఈ నెల 26న స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో నిర్వహించే కార్యక్రమంలో ప్రదానం చేయనున్నట్టు తెలిపారు.

మహిళలకు వరం స్వస్త్ నారీ సశక్త్ పరివార్

గణపవరం: మహిళల ఆరోగ్య రక్షణకు స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వరమని పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.కిరణ్మయి అన్నారు. మంగళవారం గణపవరం మండలం సరిపల్లెలో నిర్వహించిన కార్యక్రమానికి సర్పంచ్ చనుమూరి లక్ష్మీభవాని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 30 సంవత్సరాలు నిండిన మహిళలు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మహిళల్లో వచ్చే సాధారణ సమస్యలకు తగిన వైద్యం పొందొచ్చన్నారు. మహిళల్లో రక్తపోటు, మధుమేహం, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లకు పరీక్షలు నిర్వహించి, వైద్యం అందిస్తామన్నారు. మహిళల్లో వచ్చే ఆరోగ్య సమస్యలు, రక్తహీనత, పోషకాహార లోపం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. 280 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సీహెచ్‌వో జాలాది విల్సన్, పంచాయతీ కార్యదర్శి డి.రామాంజనేయులు, సర్పంచ్ చనుమూరి దుర్గాభవాని, ఉప సర్పంచ్ క్రొవ్విడి సాయి, ఆకుల నారాయణ, పెద్దిరాజు పాల్గొన్నారు.



సరిపల్లెలో వైద్య శిబిరంలో మాట్లాడుతున్న వైద్యాధికారిణి కిరణ్మయి

నిఘా 'నేత్రం'.. నేర పరిశోధనలో కీలకం

- సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి
- పోలీస్ స్టేషన్లు సైతం నిఘా నీడలో
- పలు కేసుల చేధనలో సీసీ కెమెరాలే సాక్ష్యాలు

ఏలూరు టౌన్: నీతి, న్యాయం, ధర్మాలను కాపాడే కనిపించని నాలుగో సింహం పోలీసులకు, వాటిని రక్షించడంలో పోలీసుల అమ్ములపొదిలో ఇటీవల కాలంలో చేరిన గొప్ప ఆయుధం సీసీ కెమెరా. సమాజంలో జరిగే హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు, దాడులు, దౌర్జన్యాలు లాంటివి ఎక్కడ జరిగినా వాటిని కనిపెట్టడానికి సీసీ కెమెరాలు పోలీసులకు మూడో కన్నుగా ఉపయోగపడుతున్నాయి. పోలీసులు వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసే సీసీ కెమెరాలే కాకుండా, ప్రైవేటు వ్యక్తులు తమ ప్రాంగణాల్లో, ఇళ్లలో, దుకాణాల్లో ఏర్పాటు చేసుకునే సీసీ కెమెరాలు సైతం పోలీసుల నేర దర్యాప్తుకు తమవంతు సహకారాన్ని అందిస్తున్నాయి. వేగం పెరిగే ప్రస్తుత కాలంలో నేరాలు కూడా అంతే వేగంగా జరుగుతూ పోలీసులను ఇబ్బందులకు గురిచేస్తున్నా సీసీ కెమెరాలు వారికి సగం భారాన్ని తగ్గిస్తున్నాయనే చెప్పాలి. గతంలో ఏదైనా నేరం జరిగితే దర్యాప్తు చేసేందుకు ఎంతో సమయం పట్టేది. పైగా ఆయా కేసుల్లో నిందితుడు ఆచూకీ తెలుసుకోవడమే పోలీసులకు కష్టంగా మారేది. కాని నేడు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ నేర పరిశోధనలో పోలీసులు ముందడుగు వేస్తున్నారు. నేరస్తుల కదలికలను సైతం ఇట్టే పసిగట్టేందుకు సీసీ కెమెరాలు, నిఘా వర్గాలు కీలకంగా మారుతున్నాయి.



పత్తేబాద రోడ్డులో ఉన్న సీసీ కెమెరాలు



ఫైర్‌స్టేషన్ సెంటరులోని సీసీ కెమెరాలు



జీవీమాల్ సెంటరులోని సీసీ కెమెరాలు

సమస్యాత్మక ప్రాంతాల్లోనూ నిఘా పెట్టాలి

ఏలూరునగరంలో కొన్నిచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. ప్రధానకూడళ్లలో సుమారుగా 40కు పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇక నగరంలోని కొన్ని సమస్యాత్మక ప్రాంతాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే నేర పరిశోధనకు దోహదపడుతుంది. నేరస్తులు సైతం అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేందుకు భయపడే అవకాశం ఉంటుంది.

> **నిఘా వ్యవస్థ పటిష్టం**
>
> 
>
> ఎస్పీ ఆదేశాల మేరకు నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాం. ఏలూరు సబ్‌డివిజన్ పరిధిలో పటిష్ట నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశాం. బాధితులకు న్యాయం జరిగేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఆయా కేసుల్లో నేరస్తులను పట్టుకునేందుకు సీసీ టీవీ ఫుటేజ్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఎక్కడా అసాంఘిక శక్తులకు అవకాశం లేకుండా నిఘా పెంచాం. ముఖ్య కూడళ్లలోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం.
>
> – డి.శ్రావణ్ కుమార్, డీఎస్పీ, ఏలూరు

అపారిశుద్ధ్యంతో రహదారి అధ్వానం



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

భీమడోలు: భీమడోలు జంక్షన్‌లో రోడ్డుపై మురుగు నీరు తాండవిస్తోంది. మంగళవారం ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయ్యాయి. భీమడోలు, గుండుగొలను, సూరప్పగూడెం, పాతూరు, పలు గ్రామాల్లోని పల్లపు ఏరియాల్లోని రోడ్లపై నీరు చేరాయి. భీమడోలు జంక్షన్ రోడ్లుపై వర్షపు నీరు నిరాటంకంగా ప్రవహిస్తుంది. ఎగువ ప్రాంతాల్లోని వర్షపు నీరు పొలసానిపల్లి గ్రామం మీదుగా భీమడోలు జంక్షన్‌కు చేరుకుంది. దీంతో ఆ నీరు మురుగు డ్రెయిన్లలో కలిసి మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. పొలసానిపల్లి ఏరియాలో డ్రెయిన్లు ఆక్రమణకు గురి కావడంతో కురిసిన వర్షానికి నీరు కిందకు వెళ్లే మార్గం లేక రోడ్డుపై చేరుతుంది. ఇక్కడే హోటళ్లు, ఇతర వ్యాపార సముదాయాలు ఉండడంతో ఎక్కువగా జన సంచారంతో నిండిన ఈ ప్రాంతంలో మూడు రోజులుగా నీరు ప్రవహిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.